సాక్షి నిజామాబాద్

శనివారం । 30 । డిసెంబర్ । 2023



కబ్జా కోరల్లో ఇరిగేషన్ స్థలం

నవీపేట మండల కేంద్రంలోని ఇరిగేషన్ శాఖకు చెందిన స్థలం కబ్జా కోరల్లో చిక్కుకుంది.

- 10లో ▸



అక్రమ మైనింగ్‌పై కొరడా..

ఎవరైనా అక్రమంగా ఇసుక, మొరం తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీస్‌శాఖలకు ఆదేశాలందాయి.

- 10లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
30.3 /16.9

వాతావరణం

ఆకాశం ఉదయం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లటిగాలులు వీస్తాయి. సాయంత్రం నుంచి చలితీవ్రత పెరుగుతుంది. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

తగ్గుతున్న ఎస్సారెస్పీ నీటిమట్టం

బాల్కొండ: శ్రీరాంసాగర్ నుంచి కాల్వల ద్వారా ఆయకట్టుకు నీటివిడుదల కొనసాగుతుండడంతో ప్రాజెక్ట్‌లో నీటిమట్టం తగ్గుతోంది. పది రోజుల వ్యవధిలో 5 టీఎంసీల నీరు తగ్గింది. కాకతీయ కాలువ ద్వారా 5,500 క్యూసెక్కులు, లక్ష్మీకాలువ ద్వారా 200 క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్ట్ 521 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్‌కు 270 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 398 క్యూసెక్కులు పోతోంది. ప్రాజెక్ట్‌పూర్తి స్థాయి నీటిమట్టం 1,091(90 టీఎంసీలు) అడుగులు కాగా శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1086.9 (73 టీఎంసీలు) అడుగు నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారు పేర్కొన్నారు.

ప్రసాద్ కుటుంబానికి పరామర్శ



మాక్లూర్: మాక్లూర్‌కు చెందిన మంగళి ప్రసాద్‌తో పాటు కుటుంబంలోని మరో ఐదు గురు ఇటీవల హత్యకు గురైన విషయం తెలిసిందే. ప్రసాద్ తల్లి సుశీలను ఎంపీ అర్వింద్, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆమెకు ధైర్యం చెప్పారు. ఏ సమస్య వచ్చినా తామున్నామని భరోసా ఇచ్చారు. వీరివెంట బీజేపీ నాయకులు గంగోనే సంతోష్, సురేశ్‌నాయక్ ఉన్నారు.

జీజీహెచ్ మొదటి అంతస్తు పైనుంచి పడి ఒకరి మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మొదటి అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు పడి ఒకరు మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. ధర్పల్లి మండలం చెరువు తండాకు చెందిన లంబాడి అంబర్‌సింగ్(44) కొన్ని రోజులుగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈనెల 27న రాత్రి 9 గంటలకు మూర్ఛ రావడంతో కుటుంబ సభ్యులు అతని జీజీహెచ్‌కు తరలించారు. ఈనెల 28న మళ్లీ మూర్ఛ రావడంతో ప్రభుత్వ ఆస్పత్రి మొదటి అంతస్తు కిటికీపై నుంచి కింద పడిపోయారు. వెంటనే వైద్యులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి భార్య స్వాతి(44) ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

సీఎంను కలిసిన కాంగ్రెస్ నేతలు



ఖలీల్‌వాడి : సీఎం రేవంత్‌రెడ్డిని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితో పాటు డీసీసీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశవేణు మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో ప్రజాపాలన ప్రక్రియ విషయమై సీఎంకు వివరించారు.

రెండోరోజూ భారీగానే..

- 75,508 దరఖాస్తుల స్వీకరణ


సుభాష్‌నగర్ : ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలు కోసం చేపట్టిన ప్రజాపాలన అభయహస్తం కార్యక్రమానికి రెండోరోజు భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో కలిసి శుక్రవారం 75,508 దరఖాస్తులు స్వీకరించినట్లు డీపీవో జయసుధ తెలిపారు. మొదటిరోజు 28,868 దరఖాస్తులను కలుపుకుంటే మొత్తం 1,04,376 దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రజాపాలన దరఖాస్తులతోపాటు ఇతర సమస్యలపై మరో 8796 దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. ఈనెల 6వ తేదీవరకూ దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. శనివారం 93 గ్రామాల్లో ప్రజాపాలన సభలు నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని డీపీవో పేర్కొన్నారు.

నేడు రెండు గంటలపాటు రాకపోకల నిలిపివేత

కామారెడ్డి క్రైం: జాతీయ రహదారిపై భిక్కనూరు టోల్ ప్లాజా వద్ద శనివారం ఉదయం 5 నుంచి 7 గంటల వరకు వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు పీడీ శ్రీనివాస్‌రావు, టోల్ ప్లాజా మేనేజర్ పవన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. టోల్ ప్లాజా ప్రాంగణంలో నిర్మాణం పనులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దారి మళ్లింపు, భద్రత చర్యలు తీసుకోవాలని పోలీసుశాఖ అధికారులను కోరామన్నారు.

కాంగి రేసు

ఇటీవల శాసనసభ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అదే ఊపులో పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధమవుతోంది. ఎంపీ ఎన్నికలు సమీపిస్తుండడంతో నిజామాబాద్ ఎంపీ స్థానం నుంచి పోటీ చేసేందుకు ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. ఇప్పటికే అరడజను మంది నాయకులు టికెట్ ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎవరికి టికెట్ దక్కుతుందోననే అంశంపై పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తోంది.



ఎంపీ టికెట్ కోసం..

- నిజామాబాద్ కాంగ్రెస్‌లో పోటాపోటీ
- ఆశావహుల్లో ధర్మపురి సంజయ్, సునీల్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, ఈరవత్రి, మానాల
- తనవంతు ప్రయత్నాల్లో సినీ నిర్మాత దిల్ రాజు..!
- సోషల్ ఇంజినీరింగ్ నేపథ్యంలో ఎవరికి అవకాశం దక్కుతుందోననే ఆసక్తి
- మరోవైపు పీసీసీ అధ్యక్షుడి రేసులో మహేశ్ కుమార్ గౌడ్, షబ్బీర్‌అలీ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ఎంపీగా పోటీ చేసేందుకు పలువురు నాయకులు ఉత్సాహంగా ఉన్నారు. పదేళ్ల తర్వాత రాష్ట్రంలో అధికారం రావడంతో నిజామాబాద్ ఎంపీ టికెట్ కోసం ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా రెండు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీల మధ్య ప్రధానంగా పోటీ నెలకొనే అవకాశాలు ఎక్కువగా ఉండడంతో పాటు జాతీయ అంశాలు ఈ ఎన్నికలను ప్రభావితం చేయనున్న నేపథ్యంలో ప్రత్యేకత నెలకొంది.

సానుభూతిపరంగా సునీల్‌రెడ్డి

బాల్కొండ నియోజకవర్గం నుంచి గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి చెందిన ముత్యాల సునీల్‌రెడ్డి సైతం ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగేందుకు ఉత్సాహం చూపుతున్నారు. స్వల్ప తేడాతో ఓడిపోయినందున సునీల్‌రెడ్డిపై సానుభూతి ఉంది. ఈ నేపథ్యంలో ఎంపీగా బరిలోకి దిగితే సానుకూల ఫలితం వస్తుందని సునీల్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డిని దీటుగా ఎదుర్కోవడంతో సునీల్‌కు కొందరు పార్టీ సీనియర్లు కూడా మద్దతు ఇస్తున్నారు. దీంతో సునీల్ తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు.

- మరోవైపు మైనారిటీ కోటాలో ఈ టికెట్ ఆశావహుల జాబితాలో పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్ సైతం ఉన్నారు. మైనారిటీ కావడంతో సదరు ఓట్లు తనకు గంపగుత్తగా వస్తాయని భావిస్తున్నారు. గత ఎన్నికల్లో నిజామాబాద్ అర్బన్ టికెట్టు ఆశించి విఫలమయ్యారు. దీంతో ఎంపీ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు.

జాబితాలో ఈరవత్రి..

బాల్కొండ మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ మాజీ విప్ ఈరవత్రి అనిల్ కూడా ఎంపీ టికెట్ ఆశావహుల జాబితాలో ఉన్నారు. బీసీ కోటాలో తనకు టికెట్టు ఇస్తే నిజామాబాద్ లోక్‌సభ పరిధిలో ఉన్న బీసీ ఓట్లతో పాటు తన సామాజికవర్గానికి చెందిన పద్మశాలి ఓట్లు గంపగుత్తగా వస్తాయనే భావనలో ఉన్నారు. అదేవిధంగా మైనారిటీ ఓట్లు పూర్తిగా కాంగ్రెస్‌కే వస్తాయని భావిస్తున్నారు. సోషల్ ఇంజినీరింగ్ లెక్కల నేపథ్యంలో ఉత్తర తెలంగాణలో మాత్రమే కచ్చితంగా బీసీలకు ఇవ్వాల్సిన పరిస్థితులు ఉన్న నేపథ్యంలో తనకు టికెట్టు ఇస్తే కులాల సమీకరణలో ఉపయోగం ఉంటుందని భావిస్తున్నారు.

- మరోవైపు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి సైతం ఎంపీ టికెట్ ఆశించే వారి జాబితాలో ఉన్నట్లు పార్టీ శ్రేణుల్లో చర్చ జరుగుతోంది. పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో వివిధ కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఉండేలా చేసిన మానాలకు టికెట్టు కేటాయించాలని పలువురు అంటున్నారు.
- ఇదిలా జిల్లాలోని మోపాల్ మండలం నర్సింగ్‌పల్లికి చెందిన ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజు కూడా నిజామాబాద్ ఎంపీ టికెట్ కోసం తనవంతుగా గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దిల్ రాజు సీఎం రేవంత్‌రెడ్డికి సన్నిహితంగా ఉంటారనే పేరుంది. ఈ నేపథ్యంలో ఎంపీ టికెట్ కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

మరో ఇద్దరు ముఖ్యులకు..

ఇక ఉమ్మడి జిల్లాకు చెందిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ పీసీసీ అధ్యక్ష పీఠం రేసులో ఉన్నారు. ఉత్తర తెలంగాణ నుంచి పీసీసీ అధ్యక్షుడిని ఎంపిక చేస్తారని తెలుస్తోంది. బీసీకి కేటాయిస్తే మహేష్‌కుమార్‌గౌడ్‌కే మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీ ఇచ్చి పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్‌ను నియమించేందుకు పార్టీ అధిష్టానం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే షబ్బీర్‌అలీకి మాత్రం ఎమ్మెల్సీ ఇచ్చి రాష్ట్ర కేబినెట్‌లో బెర్త్ కేటాయించనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో బోధన్ నుంచి గెలుపొందిన పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డికి కేబినెట్ ఖాయమైనట్లు తెలుస్తోంది. షబ్బీర్‌కు మంత్రి పదవి ఇస్తే జిల్లా నుంచి రెండు బెర్త్‌లు వచ్చినట్లే.

ముందువరుసలో సంజయ్..

ఎంపీ టికెట్టు ఆశిస్తున్న వారిలో మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ ముందువరుసలో ఉన్నారు. సంజయ్ గత శాసనసభ ఎన్నికల్లో అర్బన్ టికెట్టు కోసం తుదివరకు గట్టి ప్రయత్నం చేశారు. అయితే ఈ టికెట్టును మైనారిటీ అయిన షబ్బీర్ అలీకి అధినాయకత్వం కేటాయించడంతో పార్టీ కోసం పనిచేశారు. ఈ క్రమంలో తాజాగా ఎంపీ టికెట్టు కోసం తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. బీసీ కావడంతో పాటు మున్నూరు కాపు సామాజికవర్గం కావడంతో కలిసి వస్తుందని సంజయ్ భావిస్తున్నారు.

పాత డిజైన్ ప్రకారమే 'మంచిప్ప' పనులు

- రైతులపై పెట్టిన కేసులు ఎత్తేస్తాం
- పదేళ్లలో బీఆర్ఎస్ ఒక్క ఎకరాకూ నీరందించలేదు
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): పాత డిజైన్ ప్రకారమే మంచిప్ప వద్ద ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు పనులు చేపడతామని, ఈమేరకు సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి కొత్త జీవో తీసుకొస్తామని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని న్యాల్‌కల్ మాసాని చెరువు నుంచి నిజాంసాగర్ కెనాల్‌కు గేట్లు ఎత్తి ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా ప్రాణహిత–చేవెళ్ల పనులు పరిశీలించి, జలవనరులశాఖ అధికారుల వద్ద వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం భూపతిరెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మంచిప్పకు వచ్చి ప్రకటించిన విధంగా పాత డిజైన్ ప్రకారమే ప్రాజెక్ట్ పనులు కొనసాగుతాయన్నారు. కేవలం కమీషన్ల కోసం ప్రాజెక్ట్ రీడిజైన్ చేశారని, పదేళ్లలో ఒక్క ఎకరాకు కూడా అదనంగా నీరందించలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కాల్వల ద్వారా కాకుండా పైపుల ద్వారా సాగునీరందిస్తామని, కాంగ్రెస్ అంటేనే రైతుల ప్రభుత్వమని పేర్కొన్నారు. కేవలం రూ. 200 కోట్లు ఖర్చు చేస్తే రూరల్ నియోజకవర్గంలో 85 వేల ఎకరాలకు సాగునీరందేదని తెలిపారు. రైతులపై పెట్టిన అన్ని కేసులను పోలీసులతో మాట్లాడి ఎత్తేయిస్తామని, రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. నిజాంసాగర్ చివరి ఆయకట్టు వరకు ఆరు విడతల్లో సాగునీరందిస్తామని, ఒక్క గుంట ఎండిపోకుండా, నీరు వృథా పోకుండా చూస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంగాప్రసాద్, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, నాయకులు ఎల్లోల సాయిరెడ్డి, ఉమాపతిరావు, సతీశ్‌రావు, కూర గంగాధర్, భోజరావు, సతీశ్‌రెడ్డి, నరేశ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

'విద్య' నామమాత్రమే..

- పూర్తికాని మన ఊరు–మన బడి
- అసంపూర్తిగానే బదిలీలు, పదోన్నతులు



ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

నిజామాబాద్‌అర్బన్: విద్యాశాఖ పనితీరు ఈ ఏడాది అంతంత మాత్రంగానే ఉంది. విద్యాబోధన, పరిపాలన విధానం నామమాత్రంగానే మిగిలింది. అనేక అంశాలు, పనులు అసంపూర్తిగానే మిగిలాయి. ఎన్నో ఎన్నోళ్లుగా ఎదురుచూసిన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు ఈ ఏడాది షెడ్యూల్ రావడంతో ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు. కానీ ప్రక్రియ ఇప్పటికీ పూర్తి కాలేదు.

- జనవరి 27న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు ఖాళీల ప్రదర్శన చేపట్టారు. దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఫిబ్రవరి 21న ప్రక్రియ ముగించాలని నిర్ణయించారు. కానీ కోర్టు తీర్పు వల్ల వాయిదా పడింది. మళ్లీ అక్టోబర్‌లో ఈ ప్రక్రియ చేపట్టి కొందరికి పదోన్నతులు చేపట్టగా ఎస్‌జీటీలకు పదోన్నతులు, బదిలీలు చేపట్టలేదు. మరోసారి కోర్టు కేసు వల్ల ఆగిపోయింది. జనవరి 20న బోర్గాం(పి) ప్రభుత్వ పాఠశాలలో జిల్లా స్థాయి టీఎల్ఎం మేళా నిర్వహించారు.
- ఫిబ్రవరి 1న జిల్లా వ్యాప్తంగా ఏడు ప్రాంతాల్లో మన ఊరు–మన బడి కింద చేపట్టిన బడులను ప్రారంభించారు. మొత్తం 240 బడులకు గాను కేవలం ఏడు బడుల్లో మాత్రమే పూర్తిచేశారు. ప్రస్తుతం పనులు పడకేశాయి.
- మార్చి 23న జిల్లా వ్యాప్తంగా 152 పాఠశాలల్లో లైబ్రరీలను ప్రారంభించారు. ఇదే నెలలో కేజీబీవీ సిబ్బందికి బదిలీలు చేపట్టారు.
- పదో తరగతి పరీక్షల్లో జిల్లా విద్యార్థులు 81.02శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ పరీక్షల్లోనూ జిల్లా 8వ స్థానంలో నిలిచింది.
- జూలై 2న గ్రూప్–4 పరీక్ష, ఆగస్టు 3 నుంచి సెప్టెంబర్ 1 వరకు గురుకులాల నియామకాల కోసం పరీక్షలు జరిగాయి. సెప్టెంబర్ 5న జిల్లాలోని ఆరు పాఠశాలల్లో ఉదయం విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ప్రారంభించారు. సెప్టెంబర్ 15న జిల్లాలో టెట్ జరిగింది.

నిరాశ పరిచిన పోటీ పరీక్షలు

ఈ ఏడాది పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు నిరాశ చెందారు. ఆగస్టు 27, 28 తేదీల్లో జరగాల్సిన గ్రూప్–2 పరీక్షలు నవంబర్ 2వ తేదీ వరకు వాయిదా పడ్డాయి. ఎన్నికల కారణంగా మళ్లీ 2024 జనవరి 6, 7కు వాయిదా పడగా, మళ్లీ కొత్త ప్రభుత్వం పరీక్షల నిర్వహణను మళ్లీ వాయిదా వేసింది. అలాగే టీఆర్‌టీ(టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్టు)కు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ జరిగింది. నవంబర్ 20 నుంచి ఆన్‌లైన్‌లో పరీక్షల నిర్వహణ చేపడతామని ప్రకటించారు. ఎన్నికల కారణంగా వాయిదా వేశారు. మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారనే దానిపై స్పష్టత లేదు. ఇలా గ్రూప్–3, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టులకు సంబంధించి నియామక పరీక్షలు కూడా ఖరారు కాలేదు.



ఆరోగ్య ఇందూరు లక్ష్యంగా..

- ఉత్తమ సేవలందించేందుకు జిల్లా వైద్యశాఖ కృషి
- టీబీ నిర్మూలనలో జిల్లాకు అవార్డు
- మలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు కేసులు నిల్

నిజామాబాద్‌నాగారం: ప్రజాఆరోగ్య కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తూ ఆరోగ్య తెలంగాణ దిశగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అడుగులు వేస్తోంది. ఉత్తమ ఆరోగ్య సేవలకు గాను రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రశంసలు అందుకుంది. క్షయ నిర్మూలనకు కృషి చేయడంలో నిజామాబాద్ ముందంజలో ఉండడంతో జిల్లాకు అవార్డు దక్కింది. జిల్లాలో వైద్యులు, అధికారులు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు నిరంతరం శ్రమించడం వల్లే మార్పు కనిపిస్తోంది.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు : గతంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు 35శాతం ఉండగా.. ప్రస్తుతం 68శాతానికి పెంచారు. వ్యాధి నిరోధక టీకాలు పూర్తి స్థాయిలో 17,848 మందికి అందించి 93శాతానికి పెంచారు. నవంబర్ డెలివరీలో ప్రభుత్వాస్పత్రిలో 68శాతం కాగా, ప్రైవేటులో 32శాతం మాత్రమే ఉన్నాయి. ఇదే నెలలో 695 న్యూట్రిషన్ కిట్లను అందించడం జరిగింది.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

కార్యక్రమాన్ని డిసెంబర్ 16న వేల్పూర్‌లోని లాక్కోర పీహెచ్‌సీలో ప్రారంభించారు. యాక్షన్ ప్లాన్‌లోని షెడ్యూల్‌కి అనుగుణంగా వైద్యులు ప్రతిరోజూ గ్రామాలకు వెళ్లి క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు, నిక్షిత్ పోషన్ అభియాన్, అసంక్రమిత వ్యాధులైన గుండె జబ్బులు, మధుమేహం, క్యాన్సర్ మొదలగు వ్యాధులకు పరీక్షలు చేయడంతో పాటు అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటివరకు 48 గ్రామాల్లో 3,486 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు.



జాతీయస్థాయి అవార్డును అందుకుంటున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుదర్శనం(ఫైల్)

న్యూట్రిషన్ కిట్ : గర్భిణులలో రక్తహీనతను తగ్గించడానికి న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేస్తున్నారు. జిల్లాకు ఇప్పటి వరకు 14,146 కిట్‌లు సరఫరా కాగా అందులో 11,360 కిట్లను పంపిణీ చేశారు.

క్షయ నిర్మూలనకు కృషి : జిల్లాలో గతంలో 4,094 మంది క్షయవ్యాధిగ్రస్తులు ఉండగా 2023లో కేవలం 970 మంది మాత్రమే చికిత్స పొందుతున్నారు. వ్యాధిగ్రస్తులను 2022లో 60శాతం తగ్గించినందుకు గాను ఈ ఏడాది బంగారు పతకం ఇచ్చారు.

జాతీయ ఆరోగ్య మిషన్: ఆరోగ్య సేవలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు గాను ఈ సంవత్సరం రూ. 3కోట్ల నిధులను విడుదల చేశారు.

డెంగీ కేసులు : జిల్లాలో ప్రస్తుతం 842 డెంగీ కేసులు మాత్రమే నమోదు కాగా చికిత్సలు అందించారు.

ఆరోగ్య మహిళ

ప్రతి మంగళవారం మహిళల కోసం 8 రకాల ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారు. ఎనిమిది ఆస్పత్రుల్లో ఇప్పటి వరకు 70వేల మందికి పైగా మహిళలకు టెస్టులు చేశారు. మొత్తం 107 మందిని రిఫర్ చేసి చికిత్స చేయించారు.

తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్: ఇందులో భాగంగా 134 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మొత్తం 7,41,214 టెస్టులు చేశారు.

బస్తీ, పల్లె దవాఖానాలు : జిల్లాకు 8 బస్తీ దవాఖానాలు మంజూరు కాగా ఆరు ప్రారంభించారు. మిగతా రెండు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. జిల్లాలో 141 పల్లె దవాఖానాలు ఏర్పాటు చేయడం జరిగింది.

మలేరియా, చికెన్‌గున్యా, మెదడువాపు కేసులు నిల్ : జిల్లాలో ఈ ఏడాది ఒక్క మలేరియా, చికున్ గున్యా, మెదడువ్యాపు కేసులు నమోదు కాలేదు.

కుష్టు నిర్మూలనకు కృషి : జిల్లాలో కుష్టు నిర్మూలనకు కృషి చేశారు. ప్రస్తుతం 92 మంది వ్యాధిగ్రస్తులకు చికిత్స అందిస్తున్నారు.

కంటి వెలుగు: కంటి వెలుగులో భాగంగా 7,39,056 మందికి పరీక్షలు చేయగా, 88,135 మందికి రీడింగ్ అద్దాలు, 78,422 మందికి దూరపు అద్దాలు అందజేశారు. 1,987మందికి శస్త్ర చికిత్సలు చేశారు.

ఆరోగ్యశ్రీ : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కవరేజీని రూ. 5లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచింది. జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రులు కాకుండా ప్రైవేటులో 20 ఆరోగ్యశ్రీ కేంద్రాలున్నాయి. వీటికి రూ. 20.34 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. కేవలం జీజీహెచ్‌కే రూ. 6కోట్ల బకాయిలు ఉన్నాయి.

ఒక కుటుంబానికి ఒకే దరఖాస్తు



ధర్మారం(బి)లో ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్) : ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఒక కుటుంబానికి ఒక దరఖాస్తు సరిపోతుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. అర్హులందరికీ ఆరు గ్యారంటీల ద్వారా లబ్ధి చేకూరుస్తూ, గ్రామసభలు నిర్వహిస్తున్నామన్నారు. శుక్రవారం ధర్మారం(బి), కేశాపూర్ గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలను కలెక్టర్ పరిశీలించారు. ప్రజల వద్ద స్వీకరిస్తున్న దరఖాస్తులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అర్హులైన వారి నుంచి మహాలక్ష్మి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి, చేయూత పథకాలకు సంబంధించి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. సభలకు ఎక్కువసంఖ్యలో వస్తే ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎవరు కూడా మీసేవ సెంటర్లు, జిరాక్స్ సెంటర్లలో డబ్బులు చెల్లించి దరఖాస్తులు కొనుగోలు చేయవద్దన్నారు. జీపీ కార్యదర్శులు, మెప్మా ఆర్పీల ద్వారా ప్రతి నివాస ప్రాంతంలో దరఖాస్తులను పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. వీటిని ఉచితంగానే ఇస్తామన్నారు. అన్ని పథకాలకు ఒక కుటుంబం నుంచి ఒకే దరఖాస్తు సరిపోతుందన్నారు. ఇబ్బందులు కలుగకుండా చూడాలని జీపీ కార్యదర్శి రాజలింగంను ఆదేశించారు. టెంట్లు, తాగునీటి సౌకర్యం, హెల్ప్‌డెస్క్ ఉండాలన్నారు. జనవరి 6లోగా జీపీ కార్యాలయాల్లో దరఖాస్తులు ఇవ్వొచ్చన్నారు. దరఖాస్తులు ఇచ్చిన వారికి రశీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. కలెక్టర్ వెంట మెప్మా పీడీ రాజేందర్, డిచ్‌పల్లి తహసీల్దార్ రాజేందర్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ సంతోష్, సర్పంచ్ పత్తి మమత ఆనంద్ తదితరులున్నారు.

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

- నిజామాబాద్ ఎంపీ అర్వింద్

బాల్కొండ : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. శుక్రవారం బాల్కొండ మండలం బోదేపల్లిలో నిర్వహించిన వికసిత్ భారత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. దేశంలో ఆవాస్ యోజన కింద 4 కోట్ల ఇళ్లను కేంద్ర ప్రభుత్వం నిర్మించిందన్నారు. రాష్ట్రంలో కూడా ఇళ్ల నిర్మాణాలకు రూ. 2 లక్షల సాయం అందిస్తుందన్నారు. ప్రతిఒక్కరూ జీరో అకౌంట్‌ను తీసుకోవాలన్నారు. అంతకు ముందు మన సంకల్పం వికసిత్ భారత్ ప్రతిజ్ఞ చేసి అనంతరం నూతన క్యాలెండర్లను ఆవిష్కరించారు. వికసిత్ భారత్‌కు సంబంధించిన క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్, తహసీల్దార్ శ్రీధర్, సర్పంచ్ నోముల రవి, వైద్యాధికారిణి స్రవంతి, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

క్లుప్తంగా

5 నుంచి జిల్లాస్థాయి పోటీలు

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్ పట్టణంలోని మినీస్టేడియంలో జనవరి 5న నుంచి జిల్లా స్థాయి మంటెక్స్‌బాల్(టెన్నిస్ బాల్) అండర్–14, 17 క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు రూరల్ గేమ్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహేశ్ శుక్రవారం తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడా జట్లు జనవరి 4వ తేదీలోపు ఎంట్రీ చేసుకోవాలన్నారు. మొదటి బహుమతి రూ. 8 వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు అందజేస్తామని అన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 9666510317, 8919833851 నంబర్లను సంప్రదించాలన్నారు.

హోరాహోరీగా త్రోబాల్ పోటీలు



మాక్లూర్‌: మండలంలోని మెట్టు గ్రామంలో క్రిస్మస్ సందర్భంగా మూడో రోజైన శుక్రవారం త్రో బాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. క్రీడాకారులకు నిర్వాహకులు ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, త్రోబాల్ పోటీల్లో నిర్వహించారు. ఈ మరో రెండు రోజులు కొనసాగుతాయని నిర్వాహకుడు ప్రసాద్ తెలిపారు. చివరి రోజైన ఆదివారం రాత్రి విజేతలకు బహుమతులను అందజేస్తామన్నారు. ఫాస్టర్లు సన్మాన్ రాజ్, ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బలిజ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా దినేశ్ పాటిల్



బోధన్‌: బోధన్‌కు చెందిన హైకోర్టు న్యాయవాది దినేశ్ పాటిల్ రాష్ట్ర వీరశైవ లింగాయత్, లింగ, బలిజ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా శుక్రవారం ఎన్నికయ్యారు. వరుసగా మూడోసారి ఎన్నికై సంఘ రాష్ట్ర బాధ్యతలు నిర్వర్తించనున్నారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వెన్న ఈశ్వరప్ప, పట్లోళ్ల సంగమేశ్వర్, కేంద్ర కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ నిర్మాణ పటిష్టత కోసం రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

గాయపడ్డ యువకుడికి ఎంపీ, ఎమ్మెల్యే పరామర్శ



నందిపేట్‌: మండల కేంద్రంలో ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో గాయపడ్డ బీజేపీ కార్యకర్త కస్తూరి గంగాధర్‌ను ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఘర్షణకు దారితీసిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. బీజేపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. వారి వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

అక్రమ మైనింగ్‌పై కొరడా..

- అక్రమంగా ఇసుక, మొరం రవాణా చేస్తే కఠిన చర్యలు
- ప్రభుత్వ పాలసీని వెల్లడించే వరకు నియంత్రించాలని సూచన
- వాహనాలను సీజ్ చేయాలని ఆదేశాలు




మోర్తాడ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక, మొరం ట్రాక్టర్లు

మోర్తాడ్(బాల్కొండ): అనుమతులు లేకుండా ఇసుక, మొరంను అక్రమంగా తరలించే వారిపై కఠినంగా వ్యవహరించాలని పోలీసు, రెవెన్యూ శాఖలకు ఆదేశాలు అందాయి. జిల్లాలో ఎక్కడైనా తవ్వకాలను కొనసాగిస్తే అక్రమార్కులను గుర్తించి కేసులను నమోదు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే విధంగా ఇసుక, మొరం తవ్వకాలను రాత్రిపూట జరిపితే ఉపేక్షించేది లేదని పోలీసులు, రెవెన్యూ అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేక పాలసీని రూపొందించి మార్గదర్శకాలను జారీచేసే వరకు నియంత్రణ పకడ్బందీగా సాగాలని క్షేత్రస్థాయి అధికారులను ఉన్నతాధికారులు ఆదేశించారు. జిల్లాలోని వాగులు, ఒర్రెల నుంచి ఇసుక తవ్వకాలను నిరోధించడానికి ప్రత్యేక బృందాలను సైతం జిల్లా అధికార యంత్రాంగం రంగంలోకి దింపింది. వరద కాలువతో పాటు గుట్టల పరిసరాల నుంచి మొరం తవ్వకాలను కూడా నియంత్రిస్తున్నారు. గతంలో వాగుల నుంచి ఇసుకను తరలించడానికి కొన్ని పాయింట్లను గుర్తించారు. ప్రైవేటు నిర్మాణాలకు ఒక విధంగా, ప్రభుత్వ అభివృద్ధి పనులకు మరో విధంగా ఫీజులను డీడీల రూపంలో చెల్లించి నిర్ణయించిన తేదీల్లో రవాణా చేసేవారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇసుక, మొ రం తవ్వకాలకు ఒక విధమైన పాలసీని అనుసరించింది. ఇప్పుడు కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పాలసీని మార్చాలని ఆలోచిస్తున్నారు.ఇసుక, మొరం తవ్వకాల వల్ల ప్రభుత్వ ఆదా యం పెరిగితే ఖజానాకు కొంతైనా ప్రయోజనం కలుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రాత్రిపూట రవాణా

ఎన్నికల కోడ్ ఆరంభమైన నుంచి ఎన్నికలు ముగిసేవరకు ఇసుక, మొరం రవాణాలకు అనుమతులు ఇవ్వలేదు. దీంతో అక్రమార్కులు కొందరు రాత్రి పూట అక్రమంగా రవాణా చేయడం మొదలుపెట్టారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా పాలసీ రూపొందించడంలో జాప్యం కలగడంతో రాత్రి పూట అక్రమ రవాణా కొనసాగుతూనే ఉంది. దీని ని నియంత్రించడానికి ఆయా మండలాల్లోని పోలీసులు, రెవెన్యూ అధికారుల బృందాలతో పాటు టాస్క్‌ఫోర్స్ టీంలు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వ ఆదాయం పెంచడమే పరమావధిగా ఇసుక, మొరం తవ్వకాలపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. గతంలో వాహనాలను సీజ్‌చేసి వాల్టా యాక్టు ప్రకారం తహసీల్దార్లు జరిమానా విధించేవారు. మొరం, ఇసుకల అక్రమ రవాణాపై జరిమా నా విధించే అధికారాన్ని ప్రభుత్వం భూగర్భ ఖనిజాల శాఖకు బదలాయించింది. వాహనాలను సీజ్‌చేసి మైనింగ్ అధికారులకు అప్పగిస్తే వారు జరిమానా వసూలు చేసి వదలిపెట్టడమా లేక వారం, పది రోజుల పాటు వాహనాలను పోలీసుస్టేషన్లలోనే ఉంచేలా చేస్తున్నారు. ఏది ఏమైనా మొరం, ఇసుకల అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరించాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని పలువురు స్వాగతిస్తున్నారు.

జిల్లాలో నార్కోటిక్ పోలీసుల ఆరా..?

- ఇటీవల దొరికిన గంజాయి, ఆల్ప్రాజోలం అమ్మకాలపై విచారణ..!
- టాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ సిబ్బంది వివరాలు తెలుసుకునే పనిలో బిజీబిజీగా..

ఖలీల్‌వాడి : నిజామాబాద్ జిల్లాలో అక్రమంగా గంజాయి తరలించిన నిందితులను పట్టుకున్న ట్రాస్క్‌ఫోర్స్, ఎక్సైజ్ పోలీసుల వ్యవహారంపై నార్కోటిక్ పోలీసులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. శుక్రవారం హైదరాబాద్ చెందిన టీఎస్ న్యాబ్ పోలీసులు జిల్లా కేంద్రంలో గంజాయి, ఆల్ప్రాజోలంపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. గతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు గంజాయి అమ్ముతున్న నిందితులను పట్టుకొని వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకొని అందులో కొంత గంజాయిని అమ్మేసినట్లు వారికి అందిన సమాచారం మేరకే జిల్లాలో నార్కోటిక్ పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కామారెడ్డి జిల్లాకు చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ రమేశ్ ఆల్ప్రోజోలం సరఫరా చేస్తున్న సమయంలో నార్కోటిక్ పోలీసులకు పట్టుబడ్డారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు గతంలో గంజాయితో పాటు మత్తు పదార్థాలను పట్టుకున్న కేసుల వివరాలను సంబంధించిన డాటా పోలీసుల నుంచి తీసుకున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో గంజాయి ఎక్కువగా మహారాష్ట్రతో పాటు ఛత్తీస్‌గఢ్, కర్ణాటక ప్రాంతాల నుంచి ఎక్కువగా తరలిస్తారు. ఇప్పటికే జిల్లాలో కొందరు గంజాయిని తరలించడంతో పీడీ యాక్ట్‌లు నమోదైన ఘటనలున్నాయి. జిల్లాలో గతంలో గంజాయి విచ్చలవిడిగా అమ్మకాలు సాగాయి. పట్టణ ప్రాంతాలకు పరిమితమైన గంజాయి ఇప్పుడు మూరుమూల గ్రామీణ ప్రాంతాల వరకు సరఫరా కావడం వెనుక పోలీసులు, ఎక్సైజ్ పోలీసుల హస్తం ఉన్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా జిల్లాలో కల్తీ కల్లు దందా ఎక్కువగా కొనసాగుతుంది. జిల్లా కేంద్రలోని డిపోలకు ఈతవనాలు లేకున్నా అక్రమ కల్లు తయారీ, సరఫరా జోరుగా సాగుతుందనే ఆరోపణలు ఉన్నాయి. కల్లులో ఆల్ప్రాజోలం, డైజోఫాం వంటి మత్తుపదార్థాలు కలిపి అమ్మకాలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతుంది.

ఎక్సైజ్ కానిస్టేబుల్ ఫోన్ కాల్‌డేటాతో..!

ఎక్సైజ్ కానిస్టేబుల్ రమేశ్ ఫోన్‌లో ఇతరులతో మాట్లాడిన డిటేల్స్‌తోనే జిల్లాలో వారు ఆయా శాఖల సిబ్బందిపై సమాచారం సేకరిస్తునట్లు తెలుస్తోంది. ఇప్పటికే జిల్లా కేంద్రంలో ఆల్ప్రాజోలం వ్యవహారంలో ఓ పోలీసు కానిస్టేబుల్‌పై ఆరోపణలు గుప్పుమన్నాయి. దీంతోపాటు టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఎక్సైజ్ పోలీసులు చేసిన కేసుల పైనా కూడా నార్కోటిక్ పోలీసులు ఆరా తీయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

బ్యాంకు మేనేజర్‌పై కేసు నమోదు

లింగంపేట: మండల కేంద్రంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు మేనేజర్ ఆర్యరాజ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రభాకర్ తెలిపారు. మండలంలోని పొల్కంపేట గ్రామానికి చెందిన తలారి కిష్టయ్య ఆగస్టులో అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి బ్యాంకు ఖాతా నుంచి ఈ నెల 26న బ్యాంకు అధికారులు డబ్బులు డ్రా చేసుకున్నట్లు మృతుడి కుమారుడు సాయిబాబా బ్యాంకు ఎదుట గురువారం ఆందోళన చేపట్టి ఆర్డీవో, ఎస్సై, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు మేనేజర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



కామారెడ్డి టౌన్‌: జిల్లా కేంద్రంలోని బజరంగీ వ్యాయామశాల ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీనివాస్, అఖిల్, రవి, సుభాష్, విజయ్, బాలు, శ్రీనివాస్, కృపాల్, కోన శ్రీనివాస్, నరేస్, బాలరాజ్ తదితరులున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



మాక్లూర్‌: మండలంలోని శ్రీచంద్ర టెక్నో పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి అండర్–14 కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పోటీలకు ఎంపికైన విద్యార్థినులు సమీరా, హరిప్రియలను ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల యజమాని పొల్కం శ్రీనివాస్, హెచ్‌ఎం అనిల్‌రాజ్, వ్యాయామ ఉపాధ్యాయులు సాయిలు, గంగాప్రసాద్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెట్‌బాల్ పోటీలకు గుత్ప విద్యార్థులు..



మండలంలోని గుత్ప ప్రభుత్వ పాఠశాలకు చెందిన సాయికుమార్, శివాని, హర్షిత నెట్‌బాల్ రాష్ట్ర స్థాయి జూనియర్ పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు సునీల్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 30 నుంచి జనవరి 1 వరకు నాగార్జునసాగర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. అనంతరం క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ద్రుపతి కుమార్, పాఠశాల చైర్మన్ రమేశ్, సర్పంచ్ గంట చిన్నయ్య, ఉపాధ్యాయులు గిరిరాజ్, నరేందర్‌రావు, ఆంజనేయగౌడ్, శ్రీనివాస్, నరేశ్‌కుమార్, విష్ణుమూర్తి, ప్రవీణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో పలువురి మృతి



సంగ్రాం మృతదేహం



గణేశ్ మృతదేహం

నిజాంసాగర్(జుక్కల్): సంగారెడ్డి – నాందేడ్ జాతీయ రహదారిపై నిజాంసాగర్ మండలం అచ్చంపేట శివారులో గురువారం అర్ధరాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. బొలెరో వాహనాన్ని బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు మరణించారు. వివరాలిలా ఉన్నాయి. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా నాగుల్‌గావ్ గ్రామానికి చెందిన వాగ్మారె సంగ్రాం(32), వాగ్మారె గణేశ్(28) అన్నదమ్ములు. కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవారు. వాగ్మారె గణేశ్ మెదక్ జిల్లా కొడిపల్లి వద్ద ఇటుక బట్టీలో పనిచేస్తున్నాడు. అతడు నాలుగు రోజుల క్రితం స్వగ్రామానికి వెళ్లాడు. అన్న సంగ్రాంతో పాటు స్నేహితుడు గున్నాజీ మహాజన్ గైక్వాడ్‌కు ఇటుక బట్టీలో పని చూపిస్తానని చెప్పడంతో గురువారం ముగ్గురు కలిసి బైక్‌పై కొడిపల్లికి బయలుదేరారు. నిజాంసాగర్ మండలం అచ్చంపేట శివారులో జాతీయ రహదారిపైన రాంగ్‌రూట్‌లో హైదరాబాద్ వైపు ప్రయాణిస్తుండగా..హైదరాబాద్‌నుంచి దెగ్లూర్ వైపు వెళ్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంగ్రాం,గణేశ్‌లకు తీవ్రగాయాలవడంతో అక్కడికక్కడే మరణించారు. తీవ్రంగా గాయపడిన గున్నాజీ మహాజన్ గైక్వాడ్‌ను హైవే అథారిటీ అంబులెన్స్ సిబ్బంది బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని నిజాంసాగర్ ఎస్సై రాజశేఖర్ పరిశీలించారు.మృతుల కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి,మృతదేహాలను బాన్సువాడ ఆస్పత్రికి తరలించారు.

కారు ఢీకొని వృద్ధురాలు..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన పెద్దకొడప్‌గల్ మండలంలోని జగన్నాథ్‌పల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై కోనారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శాంతపూర్ గ్రామానికి చెందిన ఒడ్డింటి గంగవ్వ(70) ఆమె కుమారుడు పోచబోయితో కలిసి పొలం నుంచి టీవీఎస్ ఎక్సెల్‌పై ఇంటికి వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న కారు వీరిని ఢీకొన్నది. ఈ ఘటనలో గంగవ్వ అక్కడికక్కడే మృతి చెందగా పోచబోయికి గాయాలు కావడంతో స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఘటనలో..



మాక్లూర్‌: మండలంలోని దాస్‌నగర్ సమీపంలో ట్రాక్టర్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సుధీర్‌రావు శుక్రవారం తెలిపారు. జిల్లా కేంద్రానికి చెందిన ఉడుతల రాజు(28) నందిపేట మండలంలోని యూనియన్ బ్యాంక్‌లో క్లర్క్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ప్రతి రోజు తిరుగు ప్రయాణంలో బస్సులో వెళ్లే రాజు నందిపేటకు చెందిన ఒకరు నిజామాబాద్‌కు కారులో వెళ్తుండగా లిఫ్ట్ ఇచ్చారు. దాస్‌నగర్ సమీపంలో కరెంటు స్తంభాలను తీసుకెళ్తున్న ట్రాక్టర్‌ను కారు ఢీకొన్నది. ఈ ఘటనలో ముందు సీట్లో కూర్చున్న రాజుకు బలంగా తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు..



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రుద్రూర్: పోతంగల్ మండలం హంగర్గా ఫారానికి చెందిన కాంబ్లె దిలీప్ కుమార్(40) అనే రైతు విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు కోటగిరి ఎస్సై సందీప్ శుక్రవారం తెలిపారు. హంగర్గాఫారం శివారులో ఉన్న పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన బోరు వేస్తుండగా కేబుల్ వైరు తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మృతుడి భార్య సంపత్‌బాయి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



సిరికొండ: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రి చికిత్స పొందుతున్న సిరికొండ ఎంపీటీసీ అల్లిపురం రాజవ్వ చిన్న కుమారుడు శేఖర్(28) మృతి చెందాడు. శేఖ ర్ ఈ నెల 14న సౌదీ నుంచి వచ్చాడు. 17న నిజామాబాద్‌కు వెళ్తుండగా డిచ్‌పల్లి మండలం నడిపల్లి వద్ద అతడు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. గాయపడిన శేఖర్‌ను జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.చికిత్స పొందుతూ శేఖర్ గు రువారం రాత్రి మృతి చెందాడు.శుక్రవారం నిర్వ హించిన అంత్యక్రియల్లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, జెడ్పీటీసీలు మాన్‌సింగ్, జగన్,సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏసీబీ కేసులో ఇంజనీర్‌కు జైలు శిక్ష

ఖలీల్‌వాడి: నిజామాబాద్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో పని చేస్తున్న ఇంజనీర్ చంద్రకాంత్ నాయక్‌కు నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఏసీబీ కోర్టు జడ్జి కుమార్ వివేక్ శుక్రవారం తీర్పు ఇచ్చారు. 2010లో పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో పని చేస్తున్నప్పుడు రూ. 25వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఈ కేసులో ఏసీబీ కోర్టు చంద్రకాంత్ నాయక్‌కు నాలుగేళ్ల శిక్ష, రూ.25 వేల జరిమానా విధించారు.

కొల్లూర్‌లో ఒకరి అదృశ్యం

బోధన్ టౌన్‌: కోటగిరి మండలంలోని కొల్లూర్ గ్రామానికి చెందిన సాయిలు అక్టోబర్ 30 నుంచి అదృశ్యమైనట్లు సీఐ వీరయ్య శుక్రవారం తెలిపారు. సాయిలుకు రెంజల్ మండలానికి చెందిన నాగమణితో 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కొన్ని నెలల క్రితం భార్య పుట్టింటికి వెళ్లడంతో మనస్తాపానికి చెందిన సాయిలు అక్టోబర్29న పురుగుల మందు సేవించాడు. గమనించిన సాయిలు తండ్రి చికిత్స నిమిత్తం బోధన్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయిలు అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

అణగారిన వర్గాలవారంతా దళితులే..



గ్రంథ ఆవిష్కరణలో పాల్గొన్న రచయితలు, అధ్యాపకులు, విద్యార్థులు

తెయూ(డిచ్‌పల్లి): దళితులంటే కేవలం మాల, మాదిగలు మాత్రమే కాదని అణగారిన వర్గాల వారంతా దళితులేనని తెయూ తెలుగు అధ్యయన శాఖ ప్రొఫెసర్ కనకయ్య పేర్కొన్నారు. శుక్రవారం తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ సెమినార్ హాల్‌లో జంబూ సాహితీ వేదిక, తెయూ తెలుగు అధ్యయనశాఖ సంయుక్త ఆధ్వర్యంలో దళిత కథా వార్షిక–2022 'సాక' గ్రంథ ఆవిష్కరణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ కనకయ్య పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. దళిత సాహిత్యం ప్రధానంగా మనిషి కేంద్రంగా మానవతవాదాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. ప్రముఖ కథా రచయిత గుడిపల్లి నిరంజన్ సభాధ్యక్షత వహించారు. విశిష్ట అతిథులుగా ప్రముఖ సాహిత్య విమర్శకులు, పరిశోధకులు సంగిశెట్టి శ్రీనివాస్ 'సాక' గ్రంథంలో గల వివిధ కథలను వివరించారు. డాక్టర్ కోయి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. సింహాలు తమ చరిత్ర తాము రాసుకోకపోతే వేటగాడు చెప్పిన పిట్ట కథలే చరిత్ర అయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రముఖ కథా రచయితలు సిద్దెంకి యాదగిరి, గుడిపల్లి నిరంజన్ తాము రాసిన బోధ, గుండె నిండా జీలుబండ కథల్లో గల విభిన్న సామాజిక అంశాలను వివరించారు. ప్రముఖ రచయిత సక్కా విజయరామరాజు తన కథల్లోని విశేషాలను తెలిపారు. కార్యక్రమంలో ఆర్ట్స్ డీన్, బీవోఎస్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ త్రివేణి, విభాగాధిపతి ఆచార్య కె.లావణ్య, 'సాక' సంపాదకుడు డాక్టర్ సిద్దెంకి యాదగిరి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రమేశ్‌నాయక్‌కు పీహెచ్‌డీ ప్రదానం



రమేశ్‌నాయక్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ బయోటెక్నాలజీ విభాగంలో పరిశోధక విద్యార్థి మలావత్ రమేశ్ నాయక్ పీహెచ్‌డీ డాక్టరేట్‌ను శుక్రవారం సాధించారు. బయోటెక్నాలజీ అధ్యాపకుడు బలెని మహేందర్ పర్యవేక్షణలో 'కాంబినేటోరియల్ స్ట్రాటజీస్ ఫర్ ఎఫెక్టివ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ రూట్ నాట్ నెమటోడ్ ఇన్ఫెస్టేషన్ ఇన్ టర్మరిక్' అనే అంశంపై రమేశ్‌నాయక్ పరిశోధన పూర్తి చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. అనంతరం రమేశ్‌నాయక్‌ను రిజిస్ట్రార్ యాదగిరి, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, సైన్స్ డీన్ ఆరతి, బయోటెక్నాలజీ విభాగాధిపతి జవేరియా ఉజ్మ, బీవోస్ చైర్మన్ మామిడాల ప్రవీణ్, కంట్రోలర్ అరుణ, ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, అధ్యాపకులు కిరణ్మయి, ప్రసన్నశీల, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆదర్శం ఇందూరు యువత



చిన్నారులతో ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి

నిజామాబాద్‌నాగారం: పేదలకు నిరంతరం సేవలందిస్తున్న 'ఇందూరు యువత' అందరికీ ఆదర్శమని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడిరాకేశ్‌రెడ్డి అన్నారు. నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో ఇందూరు యువత స్వచ్ఛంద సంస్థ 12వ వార్షికోత్సవాన్ని సంస్థ అధ్యక్షుడు ముద్దుకూరి సాయిబాబా అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఎంతో మంది అభాగ్యులకు ఇందూరు యువత అండగా నిలుస్తోందని ఎంపీ, ఎమ్మెల్యే అన్నారు. ఇందూరు యువతకు తాము ఎప్పుడూ అండగా ఉంటామన్నారు. జిల్లా కేంద్రానికి చెందిన సాయి దేవిక అనే అమ్మాయి అనారోగ్యానికి గురికావడంతో రూ. 45వేల ఆర్థికసాయాన్ని అందించారు. చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రతిమరాజ్, దారం గంగాధర్, సాయిబాబా, సుశీల, స్రవంతి రెడ్డి, సుభాష్, సాయితేజ, సభ్యులు పాల్గొన్నారు.

గడువులోగా ఎన్నికల ఖర్చు వివరాలివ్వాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : ఇటీవల జరిగిన రాష్ట్ర శాసనసభ –2023 ఎన్నికల్లో జిల్లాలోని ఆయా సెగ్మెంట్ల నుంచి పోటీ చేసిన అభ్యర్థులందరూ ఎన్నికల సందర్భంగా చేసిన ఖర్చు మొత్తాలను సరి చూసుకుని, అవసరమైన వివరాలను నిర్ణీత గడువులోపు సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం రికన్సిలేషన్ నిర్వహించారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు శక్తి, పాటిల్ చిన్మయి ప్రభాకర్ విచ్చేసి, అభ్యర్థుల ఎన్నికల ఖర్చుల వివరాలు, వ్యత్యాసాలను పరిశీలించారు. అభ్యర్థులు ఎన్నికల ఖర్చుకు సంబంధించి వివకాలరె ఎన్నికల ఫలితాలు ప్రకటించిన 30 రోజుల్లోపు సమర్పించాల్సి ఉంటుందన్నారు. బ్యానర్స్, పోస్టర్స్, దినపత్రికలు, టీవీ ఛానల్‌లో ఇచ్చిన యాడ్స్ వివరాలు, వాటికైన ఖర్చుల వివరాలు కూడా తెలియజేయాలని సూచించారు. సకాలంలో వివరాలివ్వకుంటే నోటీసులిస్తామని స్పందించని వారిపై ఆర్పీ చట్టం ప్రకారం అనర్హత విధించాలని కోరుతూ ఎలక్షన్ కమిషన్‌కు లేఖ పంపిస్తామని కలెక్టర్ స్పష్టంచేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి యాదిరెడ్డి, జిల్లా ఎన్నికల వ్యయ కమిటీ నోడల్ అధికారి పాపయ్య, అభ్యర్థుల ఏజెంట్లు పాల్గొన్నారు.

మోపాల్‌లో వ్యక్తి ఆత్మహత్యాయత్నం



క్షతగాత్రుడిని ఆస్పత్రికి తీసుకొస్తున్న సిబ్బంది

మోపాల్: తనకు తెలియకుండా బిడ్డ పెళ్లి చేస్తున్నారని, వెంటనే నిలిపేయాలని కోరుతూ మండలంలోని సింగంపల్లికి చెందిన కోహిల్కర్ రాజు ఒంటికి నిప్పంటించుకుని మోపాల్ పీఎస్ ఎదుట శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజు తన భార్య సవిత ఇతరు పిల్లలతో కలిసి 15 ఏళ్ల క్రితం రుద్రూర్ నుంచి వచ్చి సింగంపల్లిలో నివాసం ఉంటున్నారు. ఆటో డ్రైవర్, ట్రావెల్స్ వాహనాలు నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. తాగుడుకు బానిసై, భార్యతో తరచూ గొడవ పడేవాడు. రెండేళ్ల క్రితం భార్య పిల్లలతో కలిసి తల్లిగారింటికి వెళ్లిపోయింది. శుక్రవారం కుమార్తె వివాహం ఉందని భార్య సవిత చెప్పి గతంలోనే పత్రిక అందించింది. నాటి నుంచి తనకు తెలియకుండా ఎందుకు పెళ్లి చేస్తున్నావంటు భార్యతో గొడవ పడ్డాడు. శుక్రవారం పీఎస్‌కు వచ్చిన రాజు పెళ్లిని ఆపాలని కోరగా బీబీపేట్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు. బయటికి వచ్చిన రాజు తన వెంట తెచ్చుకున్న డీజిల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. మంటల వేడి తాళలేక కేకలు వేయడంతో సిబ్బంది మంటలు ఆర్పేశారు. వెంటనే పోలీస్‌వాహనంలో క్షతగాత్రుడిని జీజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రిలో సీఐ వెంకటనారాయణ, ఎస్‌హెచ్‌ఓ గంగాధర్ వివరాలు సేకరించారు. సర్పంచ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్‌హెచ్‌ఓ పేర్కొన్నారు.

మత్తు పదార్థాలను రవాణా చేస్తే చర్యలు

ఖలీల్‌వాడి: మత్తు పదార్థాలను రవాణా చేస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏడీ కిషన్ శుక్రవారం తెలిపారు. జిల్లాలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆధ్వర్యంలో ఎక్సైజ్ వార్షిక నివేదిక వివరాలను వెల్లడించారు. జిల్లాలో జనవరి నుంచి డిసెంబర్ 29 వరకు 181 కేసులు నమోదు కాగా 166 మందిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్న వారి నుంచి 52 బైక్‌లు, మూడు ఆటోలు, రెండు కార్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఇప్పటి వరకు అల్ఫోజలం 6.4 కిలోలు, క్లోరో హైడ్రైడ్ 16.4, ఎండు గంజాయి 204 కిలోలు, గంజాయి మొక్కలు 107, నల్ల బెల్లం 550 కిలోలు, పటిక 101 కిలోలు, ఎన్‌డీపీఎల్ 272 లీటర్లు, దేశీ దారు 33.5, గుర్తింపు లేని మద్యం 2,530, గుర్తింపు లేని కల్లు 6836 లీటర్లు, సేకరించిన కల్లు శాంపుల్స్ 18 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.